సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 5 । ఆగస్టు । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దవులూరి గిరిజ, కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి...

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఈరంకి నాగ వేంకట సుబ్బారాయుడు (పాయకరావుపేట) శుక్రవారం రూ.1,11,116 విరాళాన్ని సమర్పించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 1.07 లక్షల విరాళం



ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు దొడ్డి హైమావతి శుక్రవారం రూ. 1,07,500 విరాళంగా అందజేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు.

న్యూస్‌రీల్

'బేబీ' చిత్ర యూనిట్ సందడి



ప్రేక్షకులతో హీరో హీరోయిన్లు ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య

అమలాపురం టౌన్: ఇటీవల విడుదలైన 'బేబీ' చిత్ర యూనిట్ విజయయాత్ర అమలాపురంలో గురువారం రాత్రి సందడి చేసింది. ఆ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న స్థానిక వీఎల్ రమా థియేటర్‌కు చిత్ర యూనిట్ రెండో ఆట సాగుతున్న సమయంలో వచ్చింది. చిత్ర హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య, చిత్ర దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్ తదితర నటులు, సాంకతిక సిబ్బంది థియేటర్‌లో ప్రేక్షకులతో మమేకమై కొద్దిసేపు మాట్లాడారు. సినిమా ఎలా ఉంది అని హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అడిగారు. పచ్చని కోనసీమలో సినీ అభిమానుల కొండంత ప్రేమ చూపిస్తారని ఆనంద్ దేవరకొండ అన్నారు. తొలుత చిత్ర హీరో హీరోయిన్లు, దర్శకులను థియేటర్ యాజమాని దుర్గారెడ్డి, మేనేజర్ వీరబాబు, సూపర్‌వైజర్లు పి.సత్తిబాబు, ప్రకాష్ సత్కరించారు. రెండో ఆట ప్రదర్శన సమయంలో వచ్చిన చిత్ర యూనిట్ గురువారం రాత్రి 11 గంటల నుంచి 11.30 గంటల వరకూ థియేటర్‌లో ప్రేక్షకులతో గడిపారు.

ఎంపీటీసీ సభ్యుడు చికిత్స పొందుతూ మృతి



చిన సత్యనారాయణ

అల్లవరం: తూర్పులంక-ఎంట్రుకోన ఎంపీటీసీ సభ్యుడు కుంచే చిన సత్యనారాయణ (48) అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఐదు రోజుల క్రితం అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. గురువారం వైద్యులు బైపాస్ ఆపరేషన్ నిర్వహించారు. అయితే అర్ధరాత్రి సమయంలో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సర్పంచ్ కదలి గంగాచలం, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు తదితరులు సత్యనారాయణ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం రాత్రి 2,17,197 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి ఉధృతి మరింత తగ్గింది. రాత్రి 10.20 అడుగులకు నీటిమట్టం చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 14,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. గత ఏడాది ఇదే సమయంలో బ్యారేజీ వద్ద 8.90 అడుగులకు నీటి మట్టం నెలకొనగా 2,09,593 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఈ వరదల సీజన్‌లో ఇప్పటి వరకూ కాటన్ బ్యారేజీ నుంచి 1301 టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు.

వృద్ధి కోరి.. సమృద్ధిగా..

- గతం కన్నా మిన్నగా రుణ వితరణ
- జిల్లాలో వ్యవసాయానికి అగ్రతాంబూలం
- పెరిగిన స్వల్పకాలిక.. దీర్ఘకాలిక రుణాల లక్ష్యం

సాక్షి అమలాపురం: వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల పురోభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఆయా రంగాలకు పెద్ద పీట వేస్తోంది. ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించడం ద్వారా ఆయా రంగాల మీద ఆధారపడిన రైతులు, నిరుద్యోగులు, యువకులు, మహిళా స్వయంశక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. జిల్లాలో భారీ వర్షాలతో ఖరీఫ్ వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఖాతాలకు జమ చేసింది. మరోవైపు బ్యాంకు రుణాలు వేగంగా ఇప్పించడం ద్వారా సాగుకు ప్రభుత్వం ఊతమందిస్తోంది. కోనసీమ జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో బ్యాంకుల ద్వారా అందించే రుణాల విషయంలో ఆ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆ తరువాత చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు, విద్యా, ఉద్యోగ, గృహ నిర్మాణాలు, ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు.



గత ఏడాది కన్నా మిన్నగా...

- గత ఏడాది మొత్తం రుణ లక్ష్యం రూ.10,455 కోట్లు కాగా ఈ ఏడాది దాన్ని పెంచి రూ.12,209 కోట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.
- వ్యవసాయ రంగానికి గత ఏడాది రూ.5,495 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఏకంగా రూ.8,511.07 కోట్లు (154.88 శాతం) రుణాలు ఇవ్వడం గమనార్హం. ఈ ఏడాది గతం కన్నా అధికంగా రూ. 8,739 కోట్లు లక్ష్యంగా పెట్టుకోవడం విశేషం.
- ఎంఎస్‌ఎంఈలకు గత ఏడాది రుణ లక్ష్యం రూ.1,707 కోట్లు కాగా, రూ.1,469.65 కోట్లు అందించారు. ఈ ఏడాది రూ.1,487 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు.
- గత ఏడాది ప్రభుత్వ ప్రాధాన్యత లేని రంగాలకు రూ.2,641 కోట్లు లక్ష్యం కాగా రూ.2,577.67 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఈ ఏడాది రూ.1,439 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.



రుణ సహాయంతో ఏర్పాటు చేసుకున్న పరిశ్రమలో పచ్చళ్లు తయారు చేస్తున్న మహిళలు (ఫైల్)

రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు మేలు

రుణ కల్పన విషయంలో వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత అధికంగా లబ్ధి పొందనున్నారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి, ఆక్వా సాగు చేసే భూములున్న రైతులతోపాటు కౌలుదారులలో పంట సాగుదారుల హక్కుల కార్డు (సీసీఆర్‌సీ), జాయింట్ లైబులిటీ గ్రూప్ (జేఎల్‌జీ), కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ), ప్రధానమంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఎఫ్‌ఈ), ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) లలో వేలాది మంది లబ్ధి పొందనున్నారు.

లబ్ధి పొందే వివిధ వర్గాల వివరాలు

పథకం	రుణం పొందే వారు	పొందే రుణం (రూ.కోట్లలో)
కేసీసీ యానిమల్ హస్‌బెండరీ	7,290	65.61
కేసీసీ ఫిషరీస్	1,159	77.42
సీసీఆర్‌సీ	10,000	85
జేఎల్‌జీ/ఆర్‌ఎంజీ	2,000	70
ఇతర రైతులు	1,500	4.50
యాంత్రీకరణ	2,086	139.05
డెయిరీ	10,151	421.76
పౌల్ట్రీ	36	36.59
ఫిషరీస్	234	350
పీఎంఎఫ్‌ఎంఈ	100	10
ఎస్‌హెచ్‌జీ గ్రామీణం	26,864	1,247.81
ఎస్‌హెచ్‌జీ అర్బన్	5,158	415.01
పీఎంఎంవై	51,200	520

జిల్లాలో 2022-23 సంవత్సరానికి కీలక రంగాలకు రుణ లక్ష్యం ఇలా (రూ.కోట్లలో)

రంగాలు	గత ఏడాది లక్ష్యం	ఇచ్చింది	ఈ ఏడాది లక్ష్యం
వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు (ఖరీఫ్)	2,427	2,631	3,026
వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు (రబీ)	1,686	2,139	2,103
దీర్ఘకాలిక రుణాలు	1,100	2,694.47	2,775
సూక్ష్మ తరహా సంస్థలకు	752.31	836.71	816
చిన్న తరహా సంస్థలకు	625.87	391.75	439
మధ్య తరహా సంస్థలకు	299.49	238.95	227
విద్యా రుణాలు	57.9	49.53	42
గృహ రుణాలు	352.04	175.03	446
ప్రభుత్వ ప్రాధాన్యత లేని రంగాలకు	2,641	2,577.98	1,439

ఈ ఏడాదీ లక్ష్యానికి మించి ఇస్తాం



గత ఏడాది ఇచ్చినట్టుగా ఈ సంవత్సరం కూడా లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జిల్లా కమిటీ సూచనల మేరకు రైతులకు, మహిళలకు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడం ద్వారా వారి అభ్యున్నతికి బ్యాంకింగ్ వ్యవస్థ అండగా ఉందని నిరూపిస్తాం.

– కె.శ్యామ్‌బాబు, లీడ్‌బ్యాంకు మేనేజర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

మాణిక్యాంబా అమ్మవారికి బంగారు కానుక

రూ. 4.75 లక్షల విలువైన హారం సమర్పణ



ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారికి బంగారు కానుక అందజేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి



మాణిక్యాంబా అమ్మవారికి అందజేసిన బంగారు కానుక

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా అమ్మవారికి రాజమహేంద్రవరం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి శుక్రవారం బంగారు హారం సమర్పించారు. 89.100 మిల్లీగ్రాముల ముత్యాలు, బంగారు పూసలతో ఉన్న ఈ హారం విలువ రూ.4,75,000. కుటుంబ సభ్యులతో కలసి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి భీమేశ్వరస్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నంది మంటపంలో వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈఓ పితాని తారకేశ్వరరావు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కాట్రేనికోన: భారత ప్రభుత్వ సంస్థ సీఐపీఈటీ విజయవాడ ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తామని సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో 6 నెలల ఉచిత శిక్షణ అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలలో ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని వివరించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలను సిపేట్ అందిస్తోందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 కనీస వయసు గల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన యువత కాట్రేనికోన మండలం పెనుమల్లె గ్రామానికి చెందిన కొల్లు రమణ ఫౌండేషన్ ద్వారా తేదీ ఈ నెల 8 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 7893586484, 9948877339 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మస్కట్‌లో చిక్కుకున్న యువతి

హోం మంత్రి వనిత చొరవతో సురక్షితంగా స్వగ్రామానికి..

- ఏజెంట్ వల్ల మోసపోయిన వైనం
- మంత్రికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

కొవ్వూరు: ఏజెంట్ వల్ల మోసపోయి మస్కట్‌లో చిక్కుకుపోయిన నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన ఓ మహిళ రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చొరవతో సురక్షితంగా స్వగ్రామానికి చేరింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులందరూ శుక్రవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి వనితను కలసి కృతజ్ఞతలు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఉపాధి కోసం గెడ్డం ప్రభ అనే మహిళ ఉపాధి కోసం మస్కట్ వెళ్లి, ఏజెంట్ చేసిన మోసం వల్ల అక్కడే చిక్కుకుపోయింది. ప్రభ దుస్థితిని ఆమె తల్లి కొండేపూడి సత్యవతి కొద్దిరోజుల క్రితం హోం మంత్రి వనిత దృష్టికి తీసుకొచ్చారు. నెల రోజుల విజిటింగ్ వీసాతో ఏజెంట్ పంపించడంతో ప్రభ అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంది. ఇలాం ఎందుకు చేశావని ఏజెంట్‌ను అడిగితే కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హోంమంత్రి వెంటనే స్పందించి జూలై 25న కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌కు లేఖ రాశారు. దాంతో విదేశాంగ శాఖ అధికారులు ప్రభ యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అక్కడి రాయబారి కార్యాలయంతో చర్చలు జరిపారు. తుదకు బాధితురాలిని సురక్షితంగా స్వగ్రామానికి చేర్చారు. మస్కట్‌లో చిక్కుకున్న తనను స్వగ్రామానికి తీసుకు రావడానికి కృషి చేసిన మంత్రి వనితకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గెడ్డం ప్రభ, ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



కొవ్వూరులో హోం మంత్రి వనితను కలిసిన గెడ్డం ప్రభ, ఆమె తల్లి కొండేపూడి సత్యవతి

జిల్లా ఎక్సైజ్ అధికారిగా రాంబాబు

అమలాపురం లిక్కర్ డిపోలో బాధ్యతలపై కొద్దిసేపు అయోమయం

అమలాపురం టౌన్: జిల్లా ఎక్సైజ్ అధికారి (డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్ -డీపీవో)గా రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. అయితే రాంబాబు అమలాపురంలోని ఏపీ బేవరేజ్ లిమిటెడ్ లిక్కర్ డిపోనకు శుక్రవారం ఉదయం నేరుగా వచ్చారు. నేను ఇక్కడకు వచ్చిన కొత్త ఆఫీసర్‌నని రాంబాబు చెప్పడంతో అప్పటికే ఆ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దశమంతరావు అయోమయంలో పడ్డారు. కొద్దిసేపు ఎవరు డిపో మేనేజర్ అనే విషయంలో స్పష్టత లేక ఆ డిపో సిబ్బందిలో అయోమయం నెలకొంది. ఈ క్రమంలో ఈ డిపో అధికారిని నేనంటే నేను అనే వాగ్వావాదం జరిగింది. ఈ లోగా ఏపీ బేవరీస్ లిమిటెడ్ అధికారులు దశమంతరావే డిపో మేనేజర్ అని.. రాంబాబు జిల్లా ఎక్సైజ్ అధికారి అన్న స్పష్టత ఇచ్చారు. అయితే జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ముమ్మిడివరంలో ఉండడంతో తర్వాత రాంబాబు అక్కడి జిల్లా కార్యాలయానికి వెళ్లి డీపీవోగా బాధ్యతలు స్వీకరించడంతో ఈ అయోమయానికి తెరపడింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్ఈబీలో ఏఈఎస్‌గా పనిచేస్తున్న రాంబాబు ఈ జిల్లాకు బదిలీ అయ్యారు.



అమలాపురం లిక్కర్ డిపో నుంచి వస్తున్న ఎక్సైజ్ అధికారి రాంబాబు (సివిల్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తి)

శాస్త్రీయ భావనలపై అవగాహన

కంబాలచెరువు: హిరోషిమా నాగసాకి దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా రూపొందించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మానవాళి మనుగడకు సైన్స్ చేస్తున్న విశేష కృషి, ఆవిష్కరణలపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కన్నూరి సతీష్‌బాబుని ఆదేశించారు. విద్యార్థులకు శాస్త్రీయ అవగాహనపై మక్కువ పెంచేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

7న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కాకినాడ వికాస కార్యాలయంలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె లచ్చారావు శుక్రవారం తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్‌లో రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, అల్బర్టా ఇంటర్‌నేషన్ ఐ హాస్పటల్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, శ్రీ సత్యమూర్తి హాస్పటల్‌లో కో ఆర్డినేటర్, రిసెప్షనిస్ట్, పబ్లిక్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటర్స్, డిక్సాన్ అండ్ హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. డీడీయుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బిటెక్, ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ. 12 వేల నుంచి రూ. 25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 7న కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరు కావచ్చని పీడీ వివరించారు.

సత్యదేవుని సన్నిధి.. పర్యావరణ పెన్నిధి

అన్నవరంలో 15 నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌పై నిషేధం

- వాటి స్థానంలో మొక్కజొన్న గింజలతో తయారయ్యే నాన్ ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం
- బయో ఎలైట్ సంస్థతో సంప్రదింపులు

ప్రయాణంలో అయినా.. పర్యటనకు వెళ్లినా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌నే వినియోగిస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించే క్రమంలో ప్రత్యామ్నాయంగా గాజు, స్టీల్, కాపర్ బాటిల్స్‌ను అక్కడక్కడా కొందరు వాడుతున్నారు. అయితే.. మొక్కజొన్న గింజలతో కూడా వాటర్ బాటిల్స్ తయారవుతున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఈవిధమైన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను హైదరాబాద్‌కు చెందిన బయో ఎలైట్ సంస్థ తయారు చేస్తోంది. ఇవి చూడటానికి అచ్చం ప్లాస్టిక్ బాటిల్స్‌లానే ఉంటాయి. – అన్నవరం



అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆగస్టు 15 నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను నిషేధిస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా గాజు, స్టీల్ లేదా కాపర్ బాటిల్స్ మాత్రమే ఉపయోగించాలని దేవస్థాన ప్రాంగణంలోని వ్యాపారులకు ఈఓ చంద్రశేఖర్ అజాద్ సర్క్యులర్ జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న బయో ఎలైట్ సంస్థ తాము తయారు చేస్తున్న నాన్ ప్లాస్టిక్ బాటిల్స్ సరఫరాకు దరఖాస్తు చేసుకుంది. గాజు వాటర్ బాటిల్ ధర రూ.80 నుంచి రూ.100 వరకూ ఉంటుందని, పొరపాటున కింద పడి, పగిలితే భక్తులకు ప్రమాదమని పేర్కొంది. అలాగే స్టీల్ లేదా మరే ఇతర మెటల్‌తో తయారు చేసిన బాటిల్స్ ఖరీదు రూ.100 కన్నా ఎక్కువని, తాము తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌లో వాటర్ నింపి రూ.40కే సరఫరా చేస్తామని బయో ఎలైట్ సంస్థ ఎండీ దిలీప్ దేవస్థానానికి దరఖాస్తు చేశారు.

బాటిల్ విక్రయాలకు అనుమతి



దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నవరం క్షేత్రంలో గత వారం పర్యటించగా.. ఆయన సమక్షంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్, బయో ఎలైట్ బాటిల్స్‌ను కాల్చి పరీక్షించాం. బయో ఎలైట్ బాటిల్ పొగ రాకుండా కాలిపోయింది. మొక్కజొన్న కాల్చితే వచ్చే వాసన వచ్చింది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌ను కాల్చితే పొగతో పాటు చుక్కచుక్కలుగా ప్లాస్టిక్ కింద పడింది. చివరన ప్లాస్టిక్ ముద్దలా వచ్చింది. బయో ఎలైట్ బాటిల్స్‌ను మరోసారి సీఐపీఈటీ సంస్థకు పంపించాం. పరీక్ష చేయిస్తే ఇవి నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అని తేలింది. ఈ నేపథ్యంలో దేవస్థానంలో షాపుల ద్వారా విక్రయించేందుకు అనుమతించాం. నీటితో బాటిల్‌ను రూ.40 ధరకు విక్రయించాలని నిర్ణయించాం.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ, సత్యదేవుని ఆలయం

ఇండియాలోనే తొలిసారి

హైదరాబాద్ మల్కాజ్‌గిరిలో మా కంపెనీ ఉంది. హైదరాబాద్ చుట్టుపక్కల కొన్ని రిసార్ట్స్‌కు, షాపింగ్ మాల్స్‌కు మా వాటర్ బాటిల్స్ సరఫరా చేస్తున్నాం. అన్నవరం దేవస్థానానికి సరఫరా చేసేందుకు దరఖాస్తు చేసుకున్నాం. నెలకు లక్ష బాటిల్స్ సరఫరా చేసే సామర్థ్యం ఉంది. దేవస్థానంలో అమ్మకాలను బట్టి ఇంకా ఎక్కువ కూడా సరఫరా చేస్తాం.

– దిలీప్, ఎండీ, బయో ఎలైట్ సంస్థ

ఇవీ ప్రత్యేకతలు

బయో ఎలైట్ సంస్థ మొక్కజొన్న గింజలను ద్రవంగా మార్చి.. హానికరం కాని కొన్ని రసాయనాలను కలిపి జర్మన్ టెక్నాలజీతో ఈ బాటిల్స్ తయారు చేస్తోంది. ఇది చూడటానికి అచ్చం ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌లానే కనిపిస్తుంది. దానికన్నా కాస్త మెత్తగా ఉంటుంది. దీనిని మూడు నెలల వరకూ వాడుకోవచ్చు. ఆ తరువాత ఆటోమెటిక్‌గా ఈ బాటిల్ శిథిలమై, ఏడాది నుంచి రెండేళ్లలోగా భూమిలో కలిసిపోతుంది. ఈ బాటిల్‌ను నాన్ ప్లాస్టిక్‌గా గుర్తిస్తూ న్యూఢిల్లీలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ కూడా ఇచ్చిందని దిలీప్ 'సాక్షి'కి తెలిపారు. దీంతోపాటు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సీఐపీఈటీ) ధ్రువీకరించిన సర్టిఫికెట్లను కూడా ఆయన దేవస్థానానికి సమర్పించారు.



బయో ఎలైట్ కంపెనీ తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్

క్లుప్తంగా

18 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సాధనాల శ్రీనివాసరావు స్మారక ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు అమలాపురంలో నిర్వహిస్తున్నట్లు టోర్న మెంట్ నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్.కాశీవి.శ్వనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఏపీ, తెలంగాణాకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హుల న్నారు. అమలాపురం ఆఫీసర్స్ క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని, మెన్స్ డబుల్స్, వెటరన్స్ డబుల్స్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు పురుషుల విభాగంలో మొదటి బహుమతి రూ. 50వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, వెటరన్ విభాగంలో మొదటి బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు అందిస్తారని పేర్కొన్నారు.

ర్యాగింగ్ నివారణపై సదస్సు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో శుక్రవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో ర్యాగింగ్ అనర్థాలపై అవగాహన సదస్సు జరిగింది. కాకినాడ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు ఈ సదస్సులో పాల్గొని పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సైబర్‌లా న్యాయవాది డాక్టర్ వసంత ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ చట్టపరమైన చర్యలను వెల్లడించారు. న్యాయ నిపుణురాలు సంధ్య ద్వారంపూడి , సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవీ మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్ చర్యలను వివరించారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌పై ర్యాగింగ్ చూపే ప్రతికూల ప్రభావాలను తెలియజేశారు. సైకాలజిస్టు హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావు, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయాలనే ఆలోచన ఒక మానసిక రుగ్మతగా అభివర్ణించారు. అనర్థమని తెలిసినా ర్యాగింగ్ చేయాలనే ఆలోచన ఉన్న విద్యార్థులు తప్పకుండా మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. న్యాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వెయ్యిమంది వైద్య విద్యార్థులు, ఆర్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్

- పౌష్టికాహార లోపం..బలహీనతకు కారణమవుతున్న నులిపురుగులు
- ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

రాయవరం: కంటికి కనిపించని శత్రువు..ఆరోగ్యానికి హాని కలిగించేది నులిపురుగు. ఇవి మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చిపిప్పి చేస్తూ రక్తహీనతకు కారణమవుతున్నాయి. అధిక శాతం అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా జాతీయ నులి పురుగుల నివారణ దినం పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ రంగం సిద్ధం చేస్తోంది.



పీహెచ్‌సీలకు చేరుకున్న డీవార్మింగ్ మాత్రలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలను ఒకటి నుంచి 19ఏళ్ల వారికి అందజేయనున్నారు. ఇందుకుగాను విద్య, వైద్య ఆరోగ్య శాఖాధికారులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 3.05 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

జిల్లాలో ఇలా.. : అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణి చేస్తారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 3,05,035 మందికి డీవార్మింగ్ మాత్రలు మింగించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో ఉన్న 1,748 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,938 పాఠశాలలు, 107 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, 34 డిగ్రీ కళాశాలలు, 36 ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ క ళాశాలలు, ఏడు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తారు. ఏడాది లోపు వారికి, తీవ్రమైన అనారోగ్యం కలిగి ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వరు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల నులి పురుగుల నిర్మూలన జరిగి, రక్తహీనత లేకుండా పో తుంది. ఒకటి నుంచి 2ఏళ్ల లోపు వయసున్న పిల్లలు సగం ఆల్బెండజోల్ మాత్రను(200 ఎంజీ), రెండేళ్లకు పైబడిన వారు ఒక మాత్ర(400ఎంజీ) తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వివిధ శాఖల సమన్వయంతో లక్ష్యాన్ని సాధించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి పీహెచ్‌సీలకు డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. అక్కడి నుంచి పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తారు.


డీవార్మింగ్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

చిన్నారులు ఆరోగ్యంపై ప్రభావం

పిల్లల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులు ఉంటే అవి రక్తాన్ని పీల్చేస్తాయి. ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం మన కడుపులోనే జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి. ఫలితంగా పదేళ్ల వయసున్న వాళ్లలో ఎక్కువగా రక్తం లేకుండా బాధపడడం, పౌష్టికాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం పడడం తదితర వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి. దీన్ని అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి. ఏక కాలంలో దేశం మొత్తం ఈ మాత్రలు మింగడం వల్ల ఒకేసారి నులి పురుగుల్ని అరికట్టవచ్చనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. అందుకే ప్రతి ఏటా రెండుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

నులి పురుగులు ఎలా వ్యాపిస్తాయంటే..

శరీరంలో నులి పురుగులు ఉన్న పిల్లవాడు తన మలంతో నేలను కలుషితం చేస్తాడు. ఈ గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయి. ఆహారం, మురికి చేతుల ద్వారా మిగతా పిల్లల చర్మం లోపలికి ఈ లార్వా చొచ్చుకు పోవడం వల్ల నులి పురుగుల సంక్రమిస్తాయి. ఈ క్రిములు క్రమంగా అభివృద్ధి చెంది తిరిగి గుడ్లను ఉత్పత్తి చేసి పిల్లలకు అనారోగ్యాన్ని కలిగిస్తాయి.

నివారణ ఇలా..

బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదు. ఎల్లప్పుడూ మరుగుదొడ్డినే వాడాలి. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. బూట్లు, చెప్పులు ధరించాలి. గోర్లను శుభ్రంగా, చిన్నవిగా కత్తిరించుకోవాలి. ఎప్పుడూ పరిశుభ్రమైన నీటినే తాగాలి. పండ్లను, కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

ఎలాంటి ఇబ్బందులు ఉండవు



ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మధ్యాహ్నం భోజనం తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కున్న అనంతరం తీసుకోవాలి. మాత్రలను చప్పరించడం లేదా నమిలి మింగడం చేయాలి. పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలి. మాత్రలు తీసుకున్న తర్వాత ఏ విధమైనా ఇబ్బంది ఏర్పడ్డా దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలి.

– డాక్టర్ జాన్‌లివి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, అమలాపురం

సద్వినియోగం చేసుకోవాలి



నులిపురుగుల నివారణకు పంపిణీ చేస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలి. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. ఈ నెల 10న మాత్రలు వేసుకోని వారు తప్పనిసరిగా ఈ నెల 17న డీవార్మింగ్ మాత్రలు తీసుకోవాలి.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం.

మూడు రేషన్ షాపుల సీజ్

గోకవరం: పలు రేషన్ షాపులపై రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గోకవరంలో గ్రామంలో వాకచర్ల లక్ష్మికి చెందిన 12వ నంబర్, కర్రి వెంకటరెడ్డికి చెందిన 13వ నంబర్, అనంతపల్లి లక్ష్మికి చెందిన 35వ నంబర్ రేషన్‌షాపులపై విజిలెన్స్ దాడులు జరిగాయి. ఆ సమయంలో షాపులు తెరచి లేకపోవడంతో డీలర్లకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో 12వ రేషన్ షాపు డీలర్ ఎంతకీ రాకపోవడంతో వీఆర్వో లచ్చిరెడ్డి సమక్షంలో షాపులో తాళాలు పగులగొట్టి సరకులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 30 ప్యాకెట్ల పంచదార తక్కువ ఉన్నట్టు గుర్తించారు. 13, 35 రేషన్‌షాపులను ఆయా డీలర్ల సమక్షంలో తెరచి తనిఖీలు నిర్వహించగా 13వ నంర్ షాపులో 125 కేజీల బియ్యం, 11 ప్యాకెట్ల పంచదార తక్కువ ఉండగా, 35వ నంబర్ షాపులో 430 కేజీల బియ్యం, 5 ప్యాకెట్ల పంచదార తక్కువ ఉన్నట్టు గుర్తించారు. ఈ మూడు షాపులను సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏజీ లక్ష్మీనారాయణ, ఎంఎస్ఓ సునీత పాల్గొన్నారు.


రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

- రూ.80 వేల విలువైన ఆభరణాలు, బైక్ స్వాధీనం
- ఒక నిందితుడు, ఇద్దరు బాలనేరస్తుల అరెస్ట్

కరప: చెడు వ్యసనాలకు బానిసైన ఒక యువకుడు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇందుకు ఇద్దరు బాలురను ప్రేరేపించి చోరీలు చేస్తూ పోలీసులకు చిక్కాడు. నేరస్తుల నుంచి రూ.80 వేలు విలువచేసే బంగారు ఆభరణాలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కొత్తమురమళ్లకు చెందిన విత్తనాల వీరేష్ కుమారుడు సంతోష్ ఐటీఐ చదువుతున్నాడు. సంతోష్ చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. అవి తీర్చలేక దొంగతనాలు చేసేవాడు. కాకినాడకు చెందిన ఇద్దరు బాలురను ప్రేరేపించి, వారితో కల్సి దొంగతనాలు చేసేవాడు. కరప మండలం నడకుదురులోని బృందావనం కాలనీకి చెందిన ఉరిటి వెంకయ్యమ్మ గత నెల 18వ తేదీ రాత్రి ఒంటరిగా నిద్రిస్తుండగా సంతోష్, ఇద్దరు బాలురను ఇంటిలోకి పంపించాడు. వెంకయ్యమ్మ ముఖంపై దిండుతో ఒకరు నొక్కిపట్టుకోగా, మరొకరు కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి రెండుచేతులకున్న నాలుగు బంగారు గాజులు, చెవులకుండే దుద్దులను లాక్కొని పరారయ్యారు. ఈ పెనుగులాటలో వెంకయ్యమ్మ చేతులకు, చెవులకు గాయాలయ్యాయి.


చోరీ కేసు గురించి వివరిస్తున్న సీఐ శ్రీనివాస్

సంతోష్ ఏమీ తెలియనట్టు లోనికివచ్చి, గాయపడిన బాధితురాలిని కాకినాడ తీసుకెళ్లి వైద్యం చేయించాడు. ఆ మరుసటి రోజు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ నాలుగు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కరప మండలం ఉప్పలంక సమీపంలో గురువారం నిందితులు ముగ్గురు దొంగిలించిన సొత్తుతో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా వారిని పట్టుకుని కూపీలాగితే నడకుదురులో దొంతనం తామే చేసినట్టు అంగీకరించారు. బంగారు ఆభరణాలను, నిందితులను కాకినాడ కోర్టులో హాజరు పరుస్తామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మోటార్‌బైక్ ఇంద్రపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం చేసిందని, దానిని ఆ స్టేషన్‌కు అప్పగిస్తామన్నారు. కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ, ఏఎస్ఐలు జి.ప్రసన్నకుమార్, వి.సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.అన్నవరంలో విషాదఛాయలు


తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాతృమూర్తి సత్యనారాయణమ్మ ఇక లేరన్న విషయం ఉప్పెనలా వ్యాపించడంతో ఎస్.అన్నవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి నివాసంలో శుక్రవారం సత్యనారాయణమ్మ గుండెపోటుకు గురయ్యారు. హుటాహుటిన తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ప్రకటించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. మాతృమూర్తి ఇక లేరన్న సమాచారం తెలుసుకున్న మంత్రి రాజా విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో ఇంటికి చేరుకుని బోరున విలపించారు. చిన్ననాటి నుంచి తన తల్లి ఎంతో అల్లారుముద్దుగా తనను చూసుకుందని, తన కోసం నిత్యం పూజలు చేసే తల్లి నిర్జీవంగా కనపించడం షాక్‌కు గురి చేసిందని విషాదహృదయంతో రాజా చెప్పడంతో అందరూ కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయంలోకి అడుగు పెట్టిన నాటి నుంచి మంత్రి వరకు ఎదగడానికి ఆమె ఆశీస్సులే శ్రీరామరక్షగా నిలిచాయన్నారు. అంతిమ యాత్రలో మాతృమూర్తి భౌతిక కాయాన్ని కైలాస భూమి వరకు మోసి అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు బొప్పన రాము, లగుడు శ్రీను, వైఎస్సార్ సీపీ తుని పట్టణ, మండల అధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయులు, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, లోవదేవస్థానం మాజీ చైర్మన్లు లాలం బాబ్జి, బొంగు ఉమారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ తదితరులు నివాళులర్పించారు. సత్యనారాయణమ్మ మృతికి సంతాపంగా శనివారం తుని మార్కెట్‌కు, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.


సత్యనారాయణమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న జనవాహిని

ఎస్‌పీఎల్‌గా పోటీ చేయొద్దన్నారని మనస్థాపం

- గోదావరిలో దూకేందుకు యత్నించిన యువకుడు
- రక్షించిన పోలీసులు

కొవ్వూరు: తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన మామిడి మనోహర్ ఎస్‌పీఎల్ (స్కూల్ పీపుల్స్ లీడర్) ఎన్నికలో పోటీ చేస్తానని తల్లికి చెప్పగా వద్దని నిరాకరించడంతో మనస్థాపం చెందాడు. స్కూలులో అందరికీ చెప్పేశాను, నా పరువు పోతుందని కోపగించి ఇంట్లోనుంచి బయటి వచ్చేశాడు. శుక్రవారంరోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకేందుకు ప్రయత్నించాడు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావుకి సమాచారం రావడంతో బ్రిడ్జిపైకి వెళ్లి యువకుడిని కాపాడి స్టేషన్‌కు చేర్చారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించి యువకుడిని అప్పగించారు.


కొవ్వూరు పట్టణ పోలీసులు కాపాడిన మామిడి మనోహర్

గంజాయి పట్టివేత

తుని: అక్రమంగా తరలిస్తున్న 20 కేజీల గంజాయిని పట్టుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ గీతారామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకెళితే..గంజాయి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఎస్సై మురళీమోహన్ తన సిబ్బందితో స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట సర్వీసు రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న హర్యానా రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్, కరమ్‌సింగ్, కాకినాడ ఇంద్రపాలెంకు చెందిన పిల్లి జాన్‌బాబు, కాకినాడ రూరల్ మండలానికి చెందిన గుబ్బల సతీష్‌చంద్ర, కాకినాడ అర్బన్‌కు చెందిన జగన్నాథం జీవకుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10 వేల నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలు మన్యం జిల్లా చింతపల్లి నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న తుని పోలీసులను డీఎస్పీ లతాకుమారి అభినందించారు.


గంజాయి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇండో నేపాల్ అండర్ -14 బాడ్మింటన్ పోటీలలో ప్రతిభ


ఎం.సుజల


ఎం.రియాన్


నిఖిల్ వర్మ

మలికిపురం: ఇటీవల నేపాల్‌లో జరిగిన ఇండో నేపాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సఖినేటిపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. మలికిపురం శ్రీ రామా బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సఖినేటిపల్లికి చెందిన ఎం.సుజల (8వ తరగతి), ఎం.రియాన్ (7వ తరగతి) ఇంటర్నేషనల్ సిరీస్‌లో బంగారు పతకాలను సాధించారు. ఇదే పోటీలలో అండర్-12 విభాగంలో పాల్గొన్న దెందుకూరి నిఖిల్ వర్మ కూడా గోల్డ్ మెడల్ సాధించాడు. విద్యార్థులను శుక్రవారం మలికిపురంలో అకాడమీ చైర్మన్ దెందుకూరి రాంబాబు రాజు అభినందించారు.

11, 12 తేదీల్లో జాబ్‌మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలోని 40 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 11, 12 తేదీల్లో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలో జరిగే ఈ జాబ్‌మేళాకు సంబంధించి దిశా నిర్దేశం చేసేందుకు ఆయన శుక్రవారం కళాశాలకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈ మేళా 17 రంగాలకు చెందిన స్కిల్ సెక్టార్ కౌన్సిల్స్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. దీనిద్వారా 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. దీనిపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్లేస్‌మెంట్ అధికారులు నూరు శాతం విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉన్నత విద్యా కమిషనర్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ అనిల్, సుధాకర్, 40 కళాశాలల ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ 2023 సంవత్సరానికి వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అర్హులైన కలిగినవారు తమ దరఖాస్తులు ఈనెల 20 తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లోగాని, నేరుగాని కాకినాడలోని డీఎస్ఏ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 89196 42248 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తమ సంస్థ సీఎస్ఆర్ నిధులను సమాజంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తోందని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మేనేజర్ అమిత్‌నారాయణ్ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ వాంబేకాలనీలోని వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్‌అండ్‌టీబీ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అధ్యక్షతన ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ నిక్షయమిత్రగా నమోదయి సీఎస్ఆర్ నిధులు రూ.9లక్షలతో 200 పౌష్టికాహార కిట్లను అందించారు. అమిత్‌నారాయణ్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడంలో తమ సంస్థ సహకారం అందించడం ఆనందంగా ఉందని చెప్పారు. డీఎల్‌డీవో డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ ఇప్పటివరకు 185 నిక్షయమిత్రాలు చేరి 1,347 మంది రోగులకు పౌష్టికాహారం కిట్లను అందించారన్నారు. ఓఎన్‌జీసీ హెడ్ హెచ్ఆర్ రావునావేద్, యాస్టో చైర్‌పర్సన్ జాన్ వెస్లీ , పెట్రోలియం ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న అమిత్‌నారాయణ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ వసుంధర తదితరులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: అప్పుల బాధ తట్టుకోలేక ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన కథనం మేరకు వేళంగి శివారు కొప్పిశెట్టివారిపేటకు చెందిన దొడ్డి జనార్దన్ 10 ఎకరాల రొయ్యల చెరువులు లీజ్‌కు తీసుకుని సాగు చేస్తున్నాడు. రొయ్యల సాగులో కలసి రాక రూ.5 లక్షల వరకు నష్టాల పాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చే దారిలేక గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు నూకరాజు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.